సాక్షి
అనంతపురం
గురువారం । 28 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.32,300

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32,300 పలికాయి.



టమాట కిలో రూ.35

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.35 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి రూ.26 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.6°/15.4°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



పెన్షన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలోని నేమకల్లు గ్రామంలో ఈ నెల 30న పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొనున్నారు. అనంతరం గ్రామ సభలో ముఖాముఖి మాట్లాడతారు. ఈ క్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం చేతుల మీదుగా పింఛన్లు అందుకోనున్న లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, తహసీల్దార్ మునివేలు, ప్రత్యేకాధికారి తిప్పేస్వామి, ఎంపీడీఓ దాస్‌నాయక్, ఈఓపీఆర్‌డీ దాస్, సీఐలు వెంకటరమణ, జయనాయక్, ఎస్‌ఐలు నబీరసూల్, నాగమధు, గురుప్రసాద్‌రెడ్డి, సర్వేయర్ రవితేజ పాల్గొన్నారు.

24 గంటలు.. 3,632 కేసులు!

- రోడ్డు భద్రత నిబంధనల ఉల్లంఘనులపై చర్యలు
- ఎంవీ యాక్ట్ కింద కేసుల నమోదు
- రూ.7,99,750 జరిమానా విధింపు

అనంతపురం క్రైం: రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎస్పీ జగదీష్ ఆదేశాలతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. గడచిన 24 గంటల వ్యవధిలో నిబంధనలు ఉల్లంఘించిన 3,632 మందిపై మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, రూ.7,99,750 జరిమానా విధించారు. అలాగే మట్కా, పేకాట, ఆరుబయలు ప్రాంతాల్లో మద్యం సేవించే వారిపై కూడా చర్యలు తీసుకున్నారు. ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణమని, కుర్రకారు వాహనాలను ఇష్టారాజ్యంగా నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రేసింగ్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్న యువతపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రమాదాల నియంత్రణకు పోలీసులు చేపట్టిన చర్యలకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

సబ్సిడీతో డ్రిప్ పరికరాల మంజూరు

- ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్



నక్కలపల్లి వద్ద రైతు పొలంలో బోరును పరిశీలిస్తున్న ఏపీడీ ఫిరోజ్‌ఖాన్

బెళుగుప్ప: సబ్సిడీతో అందజేసే డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. బెళుగుప్ప మండలం నర్సాపురం, నక్కలపల్లి, శ్రీరంగాపురం, గంగవరం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి, రైతులతో మాట్లాడారు. బిందు, తుంపర సేద్యం పరికరాలను ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తోందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 40,948 మంది రైతులు 56,867 హెక్టార్ల విస్తీర్ణంలో సూక్ష్మ సేద్యం పరికరాల ఏర్పాటుకు 451 రైతు సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వీరిలో 4,784 మంది రైతులకు 5,641 హెక్టార్లకు సంబంధించి కలెక్టర్ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రైతు వాటా చెల్లించిన వారందరికీ డ్రిప్ పరికరాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నెటాఫెమ్ స్కిప్పర్‌కు చెందిన డీసీఓలు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

సహనానికి పరీక్ష



విద్యావ్యవస్థలో పరీక్షల విభాగం అనేది గుండెకాయ లాంటిది. ఆ విభాగం సమర్థతపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. జేఎన్‌టీయూలో మాత్రం పరీక్షల విభాగం పరిస్థితి అధ్వానంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారని పలువురు హాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

- విద్యార్థులతో జేఎన్‌టీయూ పరీక్షల విభాగం ఆటలు
- నిబంధనలు విస్మరించి ఇష్టారాజ్యంగా విధులు
- గంట ముందు చేరాల్సిన ప్రశ్నపత్రాన్ని ఏకంగా ఒక రోజు ముందే పంపిన వైనం
- విషయం బయటకు రావడంతో అప్పటికప్పుడు మరో ప్రశ్నపత్రం
- జంబ్లింగ్ విధానంలోనూ గందరగోళం
- వర్సిటీ అధికారుల పనితీరుపై సర్వత్రా ఆందోళన



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో కొన్నాళ్లుగా ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నపత్రాలు పంపుతున్నారు. పరీక్ష ప్రారంభమయ్యే గంట ముందు ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం అప్‌లోడ్ చేస్తారు. ఎన్‌క్రిప్టెడ్ పాస్‌వర్డ్ సాయంతో వర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వాటిని డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేస్తారు. పేపర్ లీక్‌ను అరికట్టాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఒకటికి బదులు.. మరొకటి..

ప్రస్తుతం వర్సిటీ పరిధిలో బీటెక్ రెండు, మూడు సంవత్సరాల మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం పంపే విషయంలో గత శనివారం తీవ్ర తప్పిదం చోటుచేసుకుంది. ఆ రోజు జరగాల్సిన సబ్జెక్టు ప్రశ్నపత్రం పంపకుండా సోమవారం నిర్వహించాల్సిన పరీక్ష ప్రశ్న పత్రం పంపారు. అది కూడా గంట ముందు కాకుండా ఒక రోజు ముందే పంపడం గమనార్హం. దీన్ని డౌన్‌లోడ్ చేసిన ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు నివ్వెరపోయారు. వెంటనే వర్సిటీ పరీక్షల విభాగం అధికారులకు సమాచారం ఇవ్వడంతో తేరుకున్న వారు హడావుడిగా అప్పటికప్పుడు మరో ప్రశ్నపత్రం పంపారు. దీన్ని బట్టి సదరు విభాగం అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపై అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నాయి.

జంబ్లింగ్‌లోనూ తికమక..

విద్యార్థులకు పరీక్ష కేంద్రాల జంబ్లింగ్ అంశంపైనా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. వర్సిటీ పరిధిలో 2013లో జంబ్లింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీన్ని అనుసరించి ఒక కళాశాల విద్యార్థులను రెండు, మూడు కళాశాలలకు కేటాయిస్తారు. అయితే, ఒకే విద్యార్థికి రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు వేర్వేరు కేంద్రాలను కేటాయిస్తున్నారు. రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు మధ్య కేవలం ఒక గంట సమయం ఉంటుంది. ఈ క్రమంలో రెగ్యులర్ పరీక్ష రాసి, 30 కిలోమీటర్ల దూరంలో ఉండే వేరే కళాశాలకు ఒక గంటలో చేరుకుని పరీక్ష ఎలా రాయాలని విద్యార్థులు వాపోతున్నారు. ఇక.. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారులను మార్చి దాదాపు 5 నెలలు అవుతోంది. అయినప్పటికీ పాత వారు సంతకాలు చేసిన జవాబు పత్రాలనే నేటికీ వినియోగిస్తుండటం నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది.

అప్పటికప్పుడు కేంద్రం మార్పు..

రాయచోటిలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఇటీవల ఒక కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే, కేటాయించిన కళాశాల పేరు కాకుండా వేరే సెంటర్ పేరును హాల్‌టికెట్లలో ముద్రించడం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. దీనిపై విద్యార్థులు ఆందోళన చెందగా, అప్పటికప్పుడు మరో కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. ప్రశ్నపత్రం పంపడం మొదలు కేంద్రాల కేటాయింపు వరకూ వైఫల్యం చెందుతున్నా వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా పరీక్షల విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థులకు అందజేసిన పాత అధికారుల సంతకాలున్న జవాబు పత్రం

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నాం

పరీక్షల విభాగానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నపత్రాలు పంపడంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నాం. ఇందులో కొన్ని లోటుపాట్లు జరిగాయి. అప్‌డేట్ అయ్యాక ప్రస్తుతం అంతా సవ్యంగానే పంపుతున్నాం.

– శివకుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, జేఎన్‌టీయూ

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న కమాండెంట్ ప్రభుకుమార్, జోజిరెడ్డి

బుక్కరాయసముద్రం: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్ అన్నారు. మండలంలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో 3వ క్రీడా మహోత్సవ్–2024 ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి కమాండెంట్ ప్రభుకుమార్, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ అధికారి జోజిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మానసిక ఒత్తిడి తగ్గించడంలో క్రీడలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఉద్యోగులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన బెటాలియన్ పోలీసు జట్లను అభినందిస్తూ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కదిరిదేవరపల్లి–గుంతకల్లు' మధ్య రైలు రాకపోకలు రద్దు

గుంతకల్లు: కదిరిదేవరపల్లి–గుంతకల్లు మార్గంలో రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం–కదిరిదేవరపల్లి మధ్య జరుగుతున్న రైలు మార్గం అభివృద్ధి పనుల్లో భాగంగా రాకపోకలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఇకపై 'కదిరిదేవరపల్లి–తిరుపతి' ప్యాసింజర్ రైలు గుంతకల్లు–తిరుపతి మధ్య మాత్రమే నడుస్తుందన్నారు. తిరుపతి–గుంతకల్లు మధ్య (07589) ప్యాసింజర్ రైలు డిసెంబర్ 31వ తేదీ వరకు నడుస్తుందన్నారు. అదేవిధంగా గుంతకల్లు–తిరుపతి మధ్య (07590) ప్యాసింజర్ రైలు 2025 జనవరి 1వ తేదీ వరకు నడుస్తుందన్నారు. అభివృద్ధి పనుల అనంతరం ప్యాసింజర్ రైళ్లు యథావిధిగా నడుస్తాయని, ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మెడికో ఆత్మహత్య

- మెన్స్ హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- అనంతపురం వైద్య కళాశాలలో ఘటన
- ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారణ



వీర రోహిత్ మృతదేహం

అనంతపురం (మెడికల్): అనంతపురం బోధనాస్పత్రిలో జి.వీరరోహిత్ (23) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. అతను ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వైద్య కళాశాల వర్గాలు, టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. ఉరవకొండకు చెందిన ఉపాధ్యాయ దంపతులు జి.శారద, శివప్రసాద్‌కు వీరరోహిత్ (23), లోకేశ్వరి సంతానం. వీరరోహిత్ 2019 బ్యాచ్ విద్యార్థి. తోటి విద్యార్థులు ప్రస్తుతం హౌస్‌సర్జన్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరరోహిత్ పిన్ని కుమారులు ధీరజ్‌సాయి, విశాల్ ఇదే వైద్య కళాశాలలోనే విద్యనభ్యసిస్తున్నారు.

ఇంటికి వస్తానని ఫోన్‌చేసి..

వీరరోహిత్ బుధవారం తన తండ్రి శివప్రసాద్‌కు ఫోన్‌చేసి ఇంటికి వస్తానని చెప్పాడు. సరేనన్న తండ్రి తాను అనంతపురం వస్తున్నానని, సాయంత్రం తిరిగి ఫోన్ చేస్తానని చెప్పారు. సాయంత్రం తండ్రి ఫోన్ చేయగా వీరరోహిత్ నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. దీంతో ఆయన ధీరజ్, విశాల్‌కు ఫోన్‌చేసి వీరరోహిత్ రూమ్‌కు వెళ్లి చూడాలని చెప్పారు. వారిద్దరూ తలుపు తట్టగా.. లోపలి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. తోటి విద్యార్థులు, హౌస్‌సర్జన్లకు సమాచారం ఇవ్వడంతో వారంతా వచ్చి కిటికీలోంచి చూడగా.. వీరరోహిత్ ఫ్యాన్ కొక్కేనికి నైలాన్ తాడుతో ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి అతన్ని సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

అయోమయంగా ఉందని నోట్‌రాసి..

టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ విచారణ చేపట్టగా హాస్టల్‌లో సూసైడ్ నోట్ లభించింది. 'ఐయాం రెస్పాన్సిబుల్ ఫర్ మై డెత్. ఈ ఆలోచనల నుంచి బయటకు రాలేకపోతున్నా. అయోమయంగా ఉండి.. కాన్సన్‌ట్రేషన్ చేయలేకపోతున్నా' అని సూసైడ్ నోట్‌లో వీరరోహిత్ పేర్కొన్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు. ఒత్తిడితోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత తదితరులు వీరరోహిత్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ఫోన్‌పే ద్వారా నగదు అపహరణ.. యువకుడికి దేహశుద్ధి

గుత్తి: ఇతరుల ఫోన్‌పే ఖాతా నుంచి తన ఖాతాకు గుట్టు చప్పుడు కాకుండా రూ.వేలు బదలాయించుకున్న యువకుడిని స్థానికులు గుర్తించి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. వివరాలు... నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రాజు బుధవారం గుత్తిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తున్న తన బావమరిదిని పలకరించేందుకు వెళ్లిన రాజు... అక్కడ బావమరిది వద్ద ఎర్రగుడికి చెందిన శేఖర్ సెల్‌ఫోన్‌ను గమనించి చూసిస్తానంటూ ఇప్పించుకున్నాడు. అనంతరం బావమరిదిని మాటల్లో పెట్టి ఫోన్‌పే పిన్ నంబర్ తెలుసుకుని గుట్టుచప్పుడు కాకుండా తన ఫోన్‌పే నంబర్‌కు రూ.30 వేలు బదలాయించాడు. విషయాన్ని గమనించిన బావమరిది, బాధితుడు శేఖర్‌తో పాటు స్థానికులు రాజుకు దేహశుద్ధి చేసి, కాళ్లుచేతులు కట్టి పడేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్, హెడ్‌కానిస్టేబుల్ హనుమంతు అక్కడకు చేరుకుని రాజును విడిపించి స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సౌకర్యాలున్నా ఫలితాలు ఎందుకిలా?

- విద్యార్థులు ప్రభుత్వ బడులకు ఎందుకు రావడం లేదో ఆలోచించాలి
- పిల్లలకు అర్థమయ్యేలా బోధించాల్సిన బాధ్యత టీచర్లదే
- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్



ఎంఈఓలు, హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

అనంతపురం ఎడ్యుకేషన్: '40–50 ఏళ్ల నాటి ప్రభుత్వ బడులు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. సౌకర్యాలు కూడా బెస్ట్‌గానే ఉన్నాయి. మరి ఫలితాలు ఎందుకు మెరుగ్గా ఉండటం లేదు' అని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ప్రశ్నించారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన అనంతపురం రూరల్ పరిధిలోని సీఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఎంఈఓలు, హెచ్‌ఎంలకు జరుగుతున్న 'లీడర్‌షిప్' శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేకుల షెడ్లలో నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లకు వేలాది రూపాయల ఫీజులు కట్టి పిల్లలను పంపుతున్నారన్నారు. నాయకత్వ లోపాలతోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రాలేదన్నది వివిధ సర్వేల్లో తేలిందన్నారు. దీంతో శిక్షణ అనేది దేశ వ్యాప్తంగా తప్పనిసరి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలంటే తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సి ఉందన్నారు. లేదంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం దాదాపు 45 యాప్‌లు ఉన్నాయని, అన్నీ కలిపి ఒకట్రెండ్ యాప్‌లు చేసేలా చూస్తున్నామని చెప్పారు. ఈ రెండు యాప్‌లలోనే అన్ని అంశాలూ ఉంటాయన్నారు. 8వ తరగతి పిల్లాడు 3వ తరగతి గణితాలు చేయకపోవడం బాధాకరమన్నారు.రానున్న డీఎస్సీతో టీచర్ల కొరత ఉండదని, ఇక కావాల్సిందంతా నాణ్యమైన విద్య అని అన్నారు. సొంత పిల్లల్లా చూసుకున్నప్పుడే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల అకడమిక్ ప్రోగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా పని చేయాలన్నారు. ఒక్క విద్యార్థి ఫెయిల్ అయినా ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలు చదువుకునే భవిత కేంద్రాలపైనా దృష్టి పెడతామని చెప్పారు.

'అనంత' అంటే ప్రత్యేక మమకారం

అనంతపురం జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన మమకారం అని కోన శశిధర్ అన్నారు. వివిధ జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేసినా ఎందుకో ఈ జిల్లా అంటే ప్రత్యేక అభిమానం ఉందన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో చదువులు చెప్పాలన్నారు. సమావేశంలో పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ నాగరాజు, సీఎంఓ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు

అనంతపురం అర్బన్: ఉపాధ్యాయ హాజరులో జిల్లా వెనుకబడి ఉందని, మెరుగుపడకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులను ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌తో కలిసి విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో హాజరు సంతృప్తికరంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. రోజూ పర్యవేక్షించాలని డీఈఓని ఆదేశించారు. ఎఫ్ఏ–1 ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎఫ్ఏ– 2 ఎంట్రీల పెండింగ్ ఎక్కువగా ఉందని చెబుతూ, త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓలను ఆదేశించారు. అపార్ అప్‌డేషన్‌తో పాటు విద్యాశాఖకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ జిల్లా రోల్ మోడల్‌గా నిలవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని ఒక స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) తయారు చేయాలని చెప్పారు. ఆర్భాటాలకు పోకుండా ఆహ్లాద వాతావరణంలో మెగా పేరెంట్స్ ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహించాలన్నారు. ఫ్లెక్సీలు, స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని సూచించారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధుల్లో ఒకరు ఉండేలా గూగుల్ షీట్‌లో వారి పేరు, ఫోన్ నంబర్ నమోదు చేయాలని చెప్పారు. ఆర్‌జేడీ శామ్యూల్, తదితరులున్నారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

- వైఎస్సార్ సీపీ నేత విశ్వేశ్వర రెడ్డి ధ్వజం



అనంతపురం కార్పొరేషన్: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం అనంతపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యారంగానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. విద్యతోనే పేదల ఉన్నతి అని భావించిన జగనన్న రూ.73 వేల కోట్లతో విద్యారంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో పేద విద్యార్థులను ఆదుకున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు 'తల్లికి వందనం' పథకాన్ని ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ వర్తింపజేస్తామని చెప్పారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతి దీవెన, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి తదితర హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా నేటికీ పట్టించుకోవడం లేదన్నారు. తల్లికి వందనం పథకానికి రూ.12,500 కోట్లు అవసరమైతే, బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించి తల్లిదండ్రులను మోసం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యా, వసతి దీవెన పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు ఇంత వరకూ విద్యా సామగ్రి ఇవ్వకపోవడం దారుణమన్నారు. హాల్‌టికెట్లు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామంటూ కాలేజీల యాజమాన్యాలకు కలెక్టర్ల ద్వారా కూటమి ప్రభుత్వం హెచ్చరికలు చేయిస్తోందని, బకాయిలు చెల్లించకుండా ఇలా దిగుజారుడు చర్యలకు దిగడం శోచనీయమన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలోని 18 యూనివర్సిటీలను ఇన్‌చార్జ్‌లతో నడిపిస్తున్నారంటే విద్యార్థుల పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఏ పాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నాయని, ఇప్పటికైనా మేలు కుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని విశ్వ హెచ్చరించారు.

క్లుప్తంగా

పంచాయతీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

ఉరవకొండ: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు అన్నారు. బుధవారం ఆయన మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పన్ను వసూళ్లపై ఆరా తీశారు. పంచాయతీ ఆస్తులున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఈఓ గౌస్‌సాహెబ్‌ను ఆదేశించారు.

1న యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబరు 1న రాయదుర్గంలో జిల్లా స్థాయి స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడేందుకు విద్యార్థుల సంఖ్యను పెంచాలని పిలుపునిచ్చిన సంఘం యూటీఎఫ్ అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, నాయకులు గంగాధర్, శివ, రుద్రప్ప, మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి!

- కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద బుడగ జంగాల నిరసన
- పిల్లలు బడికి వెళ్లక ఇబ్బంది పడుతున్నారంటూ ఆవేదన
- మద్దతు తెలిపిన సీపీఐ నాయకులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బుడగ జంగాలు

రాయదుర్గం: 'మా కులమేమిటో మాకు తెలుసు. అయినా అధికారులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి' అంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుడగ జంగాల సామాజికవర్గానికి చెందిన వారు బుధవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమానికి స్థానిక సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. వీణ, మద్దెలు వాయిస్తూ మానవహారంగా ఏర్పడి తమ వెతలను గానం చేసి వినిపించారు. గంటల తరబడి కార్యాలయం ఎదుట బైఠాయించి తమకు న్యాయం చేయాలని, ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏ కులం? ఏ తెగకు చెందిన వారో సరైన సర్టిఫికెట్ లేకపోతే బడికి రావొద్దంటూ పిల్లలను వెనక్కు పంపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ పిల్లలు చదువు లేక నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారంటూ వాపోయారు. భారత రాజ్యాంగంలో సీరియల్ నంబర్ తొమ్మిది ప్రకారం తమ కులం ఎస్సీల జాబితాలో ఉండేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఉన్న బుడగ జంగాలు ఎస్సీలుగానే కొనసాగుతున్నారని, ఏపీలో మాత్రం ఎటూ తేల్చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ బాధలను అర్థం చేసుకుని శాసన సభలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపి కేంద్రానికి పంపారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చేయాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

ఇళ్ల స్థలాలు లాక్కొంటున్నారు

కొండల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న తాము ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే గత ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మల్లాపురం లేఔట్ సమీపంలో స్థలం కేటాయించిందన్నారు. చందాలు వేసుకుని రూ.5 లక్షలతో ఆ స్థలాన్ని చదును చేయించి, నిర్మాణాలకు అనువుగా సిద్ధం చేసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొందరు రాత్రికి రాత్రే ఆ స్థలంలోకి చొరబడి బోర్డు ఏర్పాటు చేసి ఆక్రమించుకున్నారని వాపోయారు. ఇది అన్యాయం అని తాము నినదిస్తే బూతులు తిడుతున్నారని భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం తహసీల్దార్ నాగరాజును కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున నాయకులు కొ్ట్రేసి, రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో చేర్చుకోలేదు



నేను రాయదుర్గంలోని బాలగంగాధర మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివాను. 496 మార్కులతో ఉత్తీర్ణత సాధించా. ఇంటర్‌లో చేరేందుకు వెళితే కుల ధ్రువీకరణ పత్రం తీసుకురమ్మన్నారు. బుడగ జంగం కావడంతో ఏ తెగ తెలిదంటూ అధికారులు సర్టిఫికెటివ్వలేదు. దీంతో ఇంటిపట్టునే ఉండాల్సి వచ్చింది. మా కులం, తెగ ఏమిటో తెలిపి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు చదువులకు అవకాశం కల్పించాలని వేడుకుంటున్నా.

– జ్యోతి, రాయదుర్గం

హోరాహోరీగా జిల్లా స్థాయి జూడో పోటీలు



తలబడిన క్రీడాకారులు

ఉరవకొండ: స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్ క్రీడా మైదానం వేదికగా జిల్లా స్థాయి రూరల్ జూడో లీగ్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి విఠల్, జ్యోతి స్కూల్ కరస్పాడెంట్ కిరణ్, ఏపీ ఎరికల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్, సీనియర్ కోచ్ సాకే పురుషోత్తం పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరు కాగా, పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో పీడీలు హలీమా, పోతులయ్య, అన్నపూర్ణ, జూడో కోచ్ రాజశేఖర్, షాప్ కోచ్ రమేష్ పాల్గొన్నారు.

వంద రోజుల్లోపు గృహ నిర్మాణాలు పూర్తి కావాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శైలజ

కూడేరు: పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను 100 రోజుల్లోపు పూర్తి చేయించాలంటూ గృహ నిర్మాణ శాఖ సిబ్బందిని ఆ శాఖ పీడీ శైలజ ఆదేశించారు. కూడేరు మండలంలో గృహ నిర్మాణాల అంశంపై ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె సమీక్షించారు. మండల వ్యాప్తంగా సుమారు 400లకు పైగా గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఉపాధి హామీ సిబ్బంది 90 రోజుల మాండేస్‌ను పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులతో కలసి ఇళ్ల నిర్మాణాలు తొందరగా చేసుకోవాలని, లేదంటే బిల్లులు మురిగిపోయే ప్రమాదముందనే విషయాన్ని తెలియజేయాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి 100 రోజుల్లోపు గృహ నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. హౌసింగ్ డీఈ హనుమప్ప, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ తులసీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లు, పురుగుల నివారణకు ఆధునిక పరిజ్ఞానం

- ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ ద్వారా సమగ్ర సస్యరక్షణ
- శిక్షణా కార్యక్రమంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ వెల్లడి



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల వ్యవసాయ, ఉద్యాన పంటల్లో తెగుళ్లు, పురుగులు, చీడ పీడల ఉధృతి ఎక్కువైన నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వ్యవసాయశాఖ అనంతపురం జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. రైతులు నష్టపోకుండా ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చిన నేషనల్ పెస్ట్ సర్వేయిలేన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్‌ఎస్) యాప్ వినియోగంపై ఉభయ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన అధికారులకు బుధవారం అనంతపురంలోని రైతు శిక్షణా కేంద్రం (ఎఫ్‌టీసీ)లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎన్‌పీఎస్‌ఎస్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వీరయ్య, ఆత్మ పీడీ ఎంసీ మద్దిలేటి, టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్, హెచ్‌ఓ రత్నకుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ... విచ్చలవిడి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి వివిధ పంటల్లో పురుగులు, తెగుళ్లు, చీడపీడల ఉధృతి పెరుగుతోందన్నారు. కొన్ని సందర్భాల్లో అవసరం లేకున్నా రెండు మూడు రకాల మందులు కలిపి పిచికారీ చేస్తున్నందున రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. దీంతో ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకుని పురుగులు, తెగుళ్ల ఉనికి, ఉధృతిని గుర్తించవచ్చునన్నారు. తెగుళ్లు ఆశించిన తొలిదశలోనే నివారణ, ఉధృతి పెరిగినపుడు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులను చైతన్య పరిచేందుకు ఈ యాప్ దోహదపడుతుందన్నారు. ఇటీవల ఉద్యాన పంటల్లో పండుఈగ సమస్య అధికంగా ఉందన్నారు. అలాగే మిరపలో నల్లతామర ఉధృతి పెరిగిందన్నారు. ఇలా కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు సర్వసాధారణంగా వివిధ రకాల పంటలను ఆశించి దిగుబడులపై ప్రభావం చూపుతున్నాయన్నారు. వీటికి పరిష్కారంగా సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చిన ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో రైతులకు మేలు జరిగేలా పనిచేయాలన్నారు.

బంగారు దుకాణాలపై విజి'లెన్స్'

- దాడుల నేపథ్యంలో పరారైన దుకాణ యజమానులు



బంగారు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం: నగరంలోని పలు బంగారు దుకాణాలపై బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక గాంధీబజార్‌లోని బంగారు దుకాణాల్లో డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సోదాలు చేశారు. దుకాణదారులు తూకాల్లో మోసాలు చేస్తున్నట్లు గుర్తించారు. గొంది నాగయ్య శెట్టి జ్యువెలరీస్, సయ్యద్ జ్యువెలరీస్‌లలో కొలతల పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని తూనికలు, కొలతల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న పలువురు బంగారు వ్యాపారులు దుకాణాలు మూసివేసి ఉడాయించారు. దాడుల అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. సయ్యద్ జ్యువెలరీస్ దుకాణ యజమానులు హాల్‌మార్క్ సర్టిఫికెట్ చూపలేదన్నారు. మూడు దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. బంగారు తూకాల్లో మిల్లీగ్రాముల మేర మోసాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. కొనుగోలు దారులు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇకపైనా దాడులను కొనసాగిస్తామని తెలిపారు.

దాడుల పుకార్లతో పరారు..

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతల) అధికారులు దాడులు చేస్తున్నారన్న పుకార్లతో బంగారు షాపుల యజమానులు దుకాణాలు మూసివేసి పరారయ్యారు. పట్టణంలో పెద్దబజార్‌లోని బంగారు దుకాణానికి బుధవారం మధ్యాహ్నం ఓ ఉద్యోగి ప్రభుత్వ వాహనంలో వచ్చారు. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలో అధికారులు తనిఖీలు చేపడుతున్నారన్న విషయం తెలుసుకున్న బంగారు షాపుల యజమానులు దుకాణాలను మూసివేసేశారు. ఒక్కసారిగా దుకాణాలు మూత పడటంతో పట్టణ ప్రజలు అయోమయంలో పడ్డారు.



విజిలెన్స్ తనిఖీల నేపథ్యంలో అనంతపురంలో బంగారు దుకాణాలను మూసివేసిన యజమానులు

బీసీసీఐ టోర్నీలో రాణించిన చక్రిక



దండు చక్రిక

అనంతపురం: ఒడిశాలోని కటక్ వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి బాలికల అండర్–15 క్రికెట్ టోర్నీలో అనంతపురం జిల్లాకు చెందిన క్రికెటర్ దండు చక్రిక మరోసారి సత్తా చాటింది. వన్డే సిరీస్ నాల్గో మ్యాచ్‌లో ఏపీ, హిమాచల్ ప్రదేశ్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన హిమాచల్‌ప్రదేశ్ జట్టు బ్యాటర్లు చక్రిక బౌలింగ్ ధాటికి ఒక్కొక్కరుగా పెవిలియన్ దారి పట్టారు. మొత్తం 7 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి మూడు వికెట్లను చక్రిక తీసుకుంది. దీంతో 90 పరుగులకు హిమాచల్ ప్రదేశ్ జట్టు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఏపీ జట్టు 16.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 91 పరుగులతో ఘన విజయం సాధించింది. జట్టులో రాణించిన చక్రికను జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జ్ కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుంతకల్లు: ఈ నెల 30 నుంచి విజయవాడలో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి ఓపెన్ సైక్లింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్, కార్యదర్శి పాండురంగ, సైక్లింగ్ సీనియర్ క్రీడాకారుడు వి.మల్లికార్జున బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్–14, 18, 23 విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 29వ తేదీలోపు కోచ్ భాస్కర్ (62815 14399)ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలి.

చిరుత దాడిలో దూడ మృతి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో రైతు తిమ్మరాజు తన ఇంటి ఆవరణలో కట్టి ఉంచిన ఆవు దూడను బుధవారం తెల్లవారుజామున ఓ చిరుత లాక్కెళ్లి చంపేసింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనతో రూ.20వేలు నష్టపోయినట్లు బాధిత రైతు తిమ్మరాజు వాపోయాడు.

వెదురు సాగుకు ప్రోత్సాహం

- హెక్టారుకు రూ.50 వేల రాయితీ
- ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు హెక్టార్లకు అనుమతి
- ఉద్యానశాఖ డీడీ నరసింహారావు వెల్లడి



వెదురు తోటను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: ఆకుపచ్చ బంగారంగా పిలిచే వెదురు సాగు (బ్యాంబూ)కు ముందుకు వస్తే ప్రత్యేక రాయితీలతో ప్రోత్సహిస్తున్నట్లు రైతులకు ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు సూచించారు. గృహ నిర్మాణం, రకరకాల ఫర్నీచర్ తయారీ, కాగితం, వస్త్రాల తయారీ, ఔషధాలు, ఆహార ఉత్పత్తులు, కళాత్మక వస్తువుల తయారీలో వెదురును విరివిగా వాడుతున్నారన్నారు. ఈ క్రమంలో బాంబూ మిషన్ ప్రాజెక్టులో భాగంగా వెదురు సాగును బ్లాక్ ప్లాంటేషన్ కింద ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇప్పటికే రాయదుర్గం ప్రాంతంలో కొందరు రైతులు సాగుకు ముందుకు వచ్చారన్నారు. విస్తీర్ణం పెరిగితే మార్కెటింగ్‌కు ఇబ్బంది లేకుండా జిల్లాలోనే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయవచ్చునని, ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతులకు రాయితీ కూడా చెల్లిస్తామని తెలిపారు. సాగు చేసిన ఏడాదికే పంట కోత మొదలవుతుందన్నారు. గుంతలు, మొక్కలు, ఊత కర్రలు, అంతర్‌కృషి, కలుపు నివారణ, నీటి నిర్వహణకు హెక్టారుకు రూ.50 వేలు చొప్పున రాయితీతో గరిష్టంగా ఒక్కో రైతుకు ఐదు హెక్టార్లకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఇందులో మొదటి ఏడాది రూ.25 వేలు, రెండో ఏడాది రూ.15 వేలు, మూడో ఏడాది రూ.10 వేల ప్రకారం రాయితీ చెల్లింపులు ఉంటాయన్నారు. పూర్తీ స్థాయి పంటగా అయితే మొక్కలు, వరుసల మధ్య 5 మీటర్ల దూరం ఉండేలా ఎకరాకు 160 మొక్కలు నాటుకోవాలన్నారు. అదే గట్ల వెంబడి అయితే రెండు మీటర్ల దూరంలో నాటుకుంటే సరిపోతుందన్నారు. వెదురుసాగుకు ముందుకు వచ్చే రైతులకు రాయితీలు ఉన్నందున ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

డిసెంబర్ 29న జిల్లా స్థాయి డీఎస్సీ మాక్ టెస్ట్

పుట్టపర్తి టౌన్: డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉమ్మడి జిల్లా ఎస్టీటీ అభ్యర్థులకు కొత్తచెరువులోని వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 29న సన్నాహక (మాక్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్తచెరువు కేంద్రంగా జరిగే ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 30వ తేదీ లోపు www.vadaanya.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహకం నగదు బహుమతితో పాటు సంస్థ ద్వారా ఎంపికైన వారికి స్కాలర్‌షిప్‌నూ అందించనున్నారు.

ప్రభుత్వ ఐటీఐలో రేపు జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మణప్పురం ఫైనాన్స్, డైకిన్ ఏసీ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొని ఆయా సంస్థల అవసరాలకు సరిపడే మానవవనరులను ఎంపిక చేయనున్నారు. పదోతరగతి, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలి. పూర్తి వివరాలకు 79954 82414లో సంప్రదించవచ్చు.

వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేయండి

- వీసీలో పశుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ ఆదేశం



వీసీలో పాల్గొన్న జిల్లా పశుశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా పశువులు, జీవాల్లో అంటు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ ఆదేశించారు. బుధవారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. డీవార్మింగ్, పీపీఆర్, చిటుకురోగం, బ్లూటంగ్, గిట్టపుండ్ల వ్యాధి, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, దమ్మురోగం, జబ్బవాపు, చొప్పవాపు, ముద్దచర్మవ్యాధి (ఎల్ఎస్‌డీ) లాంటి ప్రాణాంతక, ప్రమాదకర వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఉచిత వ్యాక్సిన్ అందజేత కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియ మొత్తం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనుమానిత ప్రాంతాలు, గతంలో వ్యాధులు ఎక్కువగా ప్రబలిన ప్రాంతాలు, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచాలన్నారు. అలాగే సెక్స్ సార్టెడ్ సెమన్ (ఎస్ఎస్ఎస్) ద్వారా లక్ష్యం మేరకు 90 శాతం పెయ్యదూడలు జన్మించేలా గర్భోత్పత్తి కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఇటీవల మంజూరు చేసిన గోకులం షెడ్ల నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు, పశుగణన కార్యక్రమం ద్వారా కచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) డీడీ డాక్టర్ టి.సుధాకర్, డివిజన్ డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ జి.వెంకటేష్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర, జేడీ కార్యాలయ ఏడీలు డాక్టర్ రాధిక, డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి, డాక్టర్ ప్రమీలారాణి, మేనేజర్ మంజుల, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ – రైతు మృతి



మృతుడు కృష్ణమూర్తి

నార్పల: వాహనం ఢీకొని ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం కొత్తపల్లికి చెందిన కృష్ణమూర్తి(63) వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యక్తిగత పనిపై బుధవారం తన ద్విచక్ర వాహనంలో తాడిపత్రి నుంచి వెంకటాంపల్లికి వెళుతుండగా నార్పల మండలం మద్దలపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సాగర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగ,ఆ మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

అనుమానంతో అంతమొందించాడు!

హిందూపురం అర్బన్: లేపాక్షి పీఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. అనుమానంతో కట్టుకున్న భార్యనే హతమార్చి ఓ వ్యక్తి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మండల కేంద్రం లేపాక్షికి చెందిన రాజశేఖర్ కొన్నేళ్ల క్రితం అదే మండలం కొండూరు ఎస్సీ కాలనీకి చెందిన తన మేనకోడలు ఈశ్వరమ్మ (32)ను రెండో వివాహం చేసుకున్నాడు. పెళ్లి తర్వాత కొండూరులోనే మకాం పెట్టాడు. వీరికి 9, 7వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న రాజశేఖర్ తరచూ ఆమెను వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. బంధువులు, చుట్టుపక్కల వారు నచ్చజెప్పినా వినకుండా భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవ పడిన రాజశేఖర్ బుధవారం వేకువజామున కత్తితో ఆమె గొంతు కోసం హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలసిన కోగటం



వైఎస్ జగన్‌కు పూలమొక్క అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సతీమణి కోగటం శ్రీదేవి, కూతురు విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎం కార్యాలయ నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం: అనంతపురం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ నిర్మాణానికి కృషి చేస్తామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కడప రీజినల్ చైర్మన్ పూల నాగరాజు హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాలం చెల్లిన భవనంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఎం కార్యాలయ సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం చుడతామని వెల్లడించారు. ఈ మేరకు రూ.1.80 కోట్లతో ఆర్‌ఎం కార్యాలయం నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరగా పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురిసినా నీరు ఆవరణలో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

కళాకారుడికి చేయూత



దివ్యాంగ కళాకారుడికి ట్రై సైకిల్ అందజేసిన ఎన్కేసీ సంస్థ సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ప్రభాకర్ హార్మోనిస్టుగా దశాబ్దాలుగా కళారంగానికి సేవలందిస్తున్నాడు. పుట్టుకతో దివ్యాంగుడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా చితికిపోయాడు. విషయం తెలుసుకున్న ఎన్కేసీ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి కమలనాథ్ అండగా నిలిచాడు. బుధవారం ఎస్‌ఐ వెంకటేశులు, రాజీవ్ కాలనీ మాజీ సర్పంచ్ హుస్సేన్, సామాజిక సేవా కార్యకర్త కేపీ రాజు, సీనియర్ కవి టీవీ రెడ్డి, బుల్లితెర దర్శకుడు తరిమెల రాజు చేతుల మీదుగా మూడు చక్రాల సైకిల్‌ను కళాకారుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో మంది నిరుపేదలు తమ దైన్యస్థితిని ఎదుర్కోలేక ఆత్మహత్యలకు పాల్పడుతుండటం విచారకరమన్నారు. యువత స్పందించి అండగా నిలవాలని కోరారు. కళాకారుడిగా ప్రభాకర్ గొప్ప హార్మోనిస్టు అని.. భవిష్యత్తులోనూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ సంస్థల సభ్యులు శంకరరెడ్డి, సాకే సుధాకర్, లింగాల పవన్ తదితరులు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం' ప్రారంభం



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా స్థాయి అధికారులు

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓల సమన్వయంతో కిశోరి వికాసం -2 పునఃప్రారంభమైందని అధికారులు తెలిపారు. బుధవారం అంబేడ్కర్ భవన్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి అధ్యక్షత వహించగా, అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తు కోసమే కిశోరి వికాసం పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బా రెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ముంచెత్తగా..

- నగరంలో ఎక్కడ చూసినా చెత్త దిబ్బలే
- చెత్త తరలింపులో నిర్లక్ష్యం
- పారిశుధ్యం మెరుగు చర్యల్లో మున్సిపల్ అధికారుల విఫలం

చెత్త సేకరణకు వినియోగించే వాహనాలు	
కాంపాక్టర్లు	13
ట్రాక్టర్లు	13
టిప్పర్లు	5
ఆటోలు	4
ట్రాక్టర్ దోజర్లు	1
జేసీబీ	1
క్లాప్ ఆటోలు	47



సాయి నగర్ 6వ క్రాస్‌లో పేరుకుపోయిన చెత్త



వ్యర్థాలను రోడ్డుపై పడేసిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాల్సిన నగరపాలక సంస్థ అధికారులు చేతులెత్తేశారు. నగరపాలక సంస్థ అధికారులు పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. అది మాటలకే పరిమితవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో ఎక్కడ చూసిన చెత్త దిబ్బలు కనిపిస్తున్నాయి. దోమలు వృద్ధి చెందడంతో పాటు పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

నగరంలో మొత్తం 50 డివిజన్ల పరిధిలో 74 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ చెత్త సేకరణ చేపట్టాల్సి ఉంది. చెత్త సేకరణకు కాంపాక్టర్లు, ట్రాక్టర్లు, క్లాప్ ఆటోలు, తదితర వాహనాలు కలుపుకుని మొత్తం 70 వరకు వాహనాలు ఉన్నాయి. నగరపాలక సంస్థలో 600 మంది వరకు పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. కాగా నగరసాలక సంస్థ అధికారులు రోజూ 130 నుంచి 140 టన్నుల చెత్తను తరలిస్తున్నామని చెబుతున్నా.. అందులో వాస్తవం లేదని తెలుస్తోంది. నగరంలోని ఆదర్శనగర్, నవోదయ కాలనీ, నాయక్ నగర్, వేణుగోపాల్ నగర్, పాతూరు, ఓబుళదేవ నగర్, జీసస్ నగర్, విద్యుత్ నగర్, హౌసింగ్ బోర్డు, రాణి నగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, ఆజాద్ నగర్, తదితర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో చెత్త సేకరణ జరగడం లేదు. దీని ఫలితంగా ప్రజలు చెత్తను ఎక్కడ వేయాలో తెలియక రోడ్లపై వేసేస్తున్నారు. నగరంలోని పాతూరు, వేణుగోపాల్ నగర్, జీసస్‌నగర్, అరవింద నగర్, తదితర ప్రాంతాల్లో చెత్త గుట్టలు గుట్టలుగా పడి ఉంటోంది. రోజుల తరబడి చెత్తను అక్కడే ఉంచేయడంతో వీధులు కంపు కొడుతున్నాయి. చెత్తను తరలించేందుకు సిబ్బంది రాకపోవడంతో దుర్వాసన వస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడంలో విఫలమవుతున్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడం లేదు.

పట్టించుకోని అధికారులు..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరాభివృద్ధి కోసం అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించారు. కాగా కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ అధికారులు ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు. కనీసం ఇప్పటికైనా ఇంటింటి చెత్త సేకరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



నగరంలో రోజూ వాహనాల ద్వారా కంపోస్టు యార్డుకు చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. రోజూ 140 టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకున్నాం. పారిశుధ్య సిబ్బందితో సక్రమంగా పని చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ విష్ణుమూర్తి, ఎంహెచ్ఓ, నగరపాలక సంస్థ

చెత్త సేకరించడం లేదు



చెత్త సేకరణకు ఎవరూ రావడం లేదు. రెండు, మూడ్రోజుల పాటు ఇంటి ఆరుబయటే చెత్తను ఉంచి మేమే ఇంటి పరిసర ప్రాంతాల్లో పడేస్తున్నాం. కనీసం చెత్తను తీసుకెళ్లకుంటే ఎలా? దోమలు అధికమై జ్వరాలు వచ్చే ప్రమాదం ఉంది. రోడ్లపై వెళ్లేటప్పుడు దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి చెత్త సేకరణ చేపట్టేలా చూడాలి.

– సుమలత, గృహిణి, ఆదర్శ నగర్

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



కృష్ణాపురం వద్ద కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

రాప్తాడు: కంది సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఏడీఏ రవి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎం.క్రిష్ణాపురం గ్రామంలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ఎల్ఆర్‌జీ-100 కంది పంటను పరిశీలించారు. కంది పంటలో చీడ పీడలు, వ్యాధుల గురించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను పారదర్శకంగా నమోదు చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలను, సూచనలు అందించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో పంట సాగు విధానాలు, దిగుబడి, ఉత్పత్తి తదితర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. రైతులు పంటసాగు చేసినప్పటి నుంచి పంట ఉత్పత్తులు అమ్ముకునే దాకా ఈ-పంట నమోదునే ఆధారంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. పీఎంఎఫ్‌బీవై పంటల బీమా పథకంలో భాగంగా రబీలో వేరుశనగ, టమాట సాగు చేసిన రైతులు సకాలంలో బీమా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శేఖర్ రెడ్డి, వీఏఏ గౌష్ బాషా, ఏంపీఈఓ రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేసిన మేయర్ వసీం, చిత్రంలో ఎమ్మెల్యే

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 13వ డివిజన్‌లో రూ.38 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్యతో కలసి మేయర్ వసీం బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పాలకవర్గం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 13వ డివిజన్‌లో ఉమానగర్‌లో వర్షాలు వస్తే కొన్ని ఇళ్లలోకి నీరు వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో ఆర్టీటీ సంస్థ సహకారంతో బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గతంలో ఈ డివిజన్ పరిధిలో ఎన్ క్యాప్ నిధులు రూ.1.95 కోట్ల వ్యయంతో సూర్య నగర్ నుంచి త్రివేణి సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, బాలాంజినేయులు, హసీనాబేగం, వైఎస్సార్ సీపీ నాయకులు బండి శ్రీకాంత్, టీడీపీ నాయకుడు రాయల్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- రూ.90 లక్షలు వృథా



మెడికల్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. పేదలకు ఇళ్ల సమీపంలోనే సత్వర వైద్యం అందించేందుకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశారు. అందులో భాగంగా అనంతపురం నగరంలో మొత్తం 10 పట్టణ ఆరోగ్య కేంద్రాలుంటే వాటిలో 6 కొత్త వాటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోవిడ్‌తో రెండున్నరేళ్లు గడిచిపోయినా నగరంలో కోర్టు రోడ్డు, బుడ్డప్ప నగర్, ఎర్రనేల కొట్టాలు, వేణుగోపాల్ నగర్, రెండో రోడ్డు, జీసస్ నగర్‌లో ఎన్‌హెచ్‌ఎం నిధులు ఆరు కొత్త పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో ఐదింటిని గత ప్రభుత్వంలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. జీసస్ నగర్ మెడికల్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రం (రూ.90 లక్షలు) 99 శాతం నిర్మాణం పూర్తి చేశారు. ఇక చిన్న పాటి పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రెండు, మూడ్రోజుల్లో వాటి పనులు పూర్తి చేయవచ్చు. కూటమి ప్రభుత్వంలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం పూర్తయితే జీసస్ నగర్, మిస్సమ్మ కాలనీ, తదితర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రూ.లక్షలు వెచ్చించి నిరుపయోగంగా ఉంచేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తుందో లేదో వేచి చూడాలి.

అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

- రూ.8.68 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. పట్టుబడిన వారిలో అనంతపురం నగరంలోని అనంతసాగర్ కాలనీకి చెందిన షికారి కోటయ్య, షికారి శ్యాలీ అలియాస్ శ్యామ్, షికారి శీన అలియాస్ అర్జున్ ఉన్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు తమ అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు తెగబడ్డారు. పుట్టపర్తి రూరల్, గోరంట్ల, సోమందేపల్లి, కదిరి ప్రాంతాల్లో ఇటీవల జరిగిన పలు చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా బుధవారం పుట్టపర్తి సమీపంలోని కర్ణాటకనాగేపల్లి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయడంతో తాము చేసిన దొంగతనాలను వారు అంగీకరించారు. వీరి నుంచి రూ 7.68 లక్షలు విలువ చేసే బంగారు, వెండి అభరణాలు, రూ. లక్ష నగదు, ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, జిల్లాతో పాటు అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలలో పలు చోట్ల దొంగతనాలు చేసి పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, సీసీఎస్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు లింగన్న రామచంద్ర, సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించి రివార్డులు అందజేశారు.

వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. మండల పరిధిలోని నామాల గ్రామానికి చెందిన అశ్వర్థ నారాయణ ద్విచక్రవాహనంలో మండల కేంద్రానికి బయలుదేరాడు. జాతీయ రహదారిపైకి వెళ్లే ప్రయత్నంలో లారీని గమనించలేదు. లారీ డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని పక్కకు తిప్పడంతో అశ్వర్థ నారాయణ కిందపడ్డాడు. స్వల్పంగా గాయపడిన అశ్వర్థ నారాయణను ఓ ప్రైవేట్ వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గాడి తప్పుతున్న శాంతిభద్రతలు

- నగరంలో అల్లరి మూకల హల్‌చల్
- బస్సులపై రాళ్లతో దాడి
- పేట్రేగిపోతున్న వీధి రౌడీలు
- పట్టించుకోని పోలీసులు



ఆర్టీసీ బస్సును ఆపి పాదరక్షను చూపుతున్న తాగుబోతులు (ఫైల్)

అనంతపురం క్రైం: నగరంలో శాంతి భద్రతలు గాడి తప్పాయి. నడిరోడ్డుపై పట్టపగలు అల్లరి మూకలు దాడులకు తెగబడుతున్నారు. ఇంతా జరుగుతున్నా పోలీసుల స్పందన అంతంతమాత్రంగానే ఉంది. గత సోమవారం స్థానిక గుత్తి రోడ్డులోని కెనరా బ్యాంక్ ముందు మధ్యాహ్నం 12:30 సమయంలో ఆరుగురు ఆకతాయిలు ముగ్గురు ఆటో డ్రైవర్లను ఏ కారణం లేకుండా చితకబాదారు. పట్టపగలే నడిరోడ్డుపై ఇంత అరాచకం జరుగుతున్నా స్థానికులు కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కూడా ప్రయత్నించలేదు. ప్రజలతో పోలీసులు మమేకం అవడంలో పూర్తిగా విఫలమయ్యారనడానికి ఇంత కన్నా నిదర్శనం లేదు. 2 గంటల పాటు ఐదుగురిని చితకబాదిన అల్లరి మూకలు తాఫీగా వాహనాల్లో వెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఓ సీనియర్ పాత్రికేయుడు సంబంధిత స్టేషన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా తాఫీగా వచ్చిన పోలీసులకు దాడిలో గాయపడ్డ వారు తారస పడ్డారు. వారిని కనీసం ఆరా కూడా తీయకుండా పోలీసులు వివాదం సద్దుమనిగిందని చెప్పి వెళ్లిపోవడం గమనార్హం

ఆర్టీసీ బస్సుపై దాడి

రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సును నడిరోడ్డుపై ఆపి తాగిన మైకంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వీధి రౌడీల వ్యవహారం సోషల్ మీడియాలో తెగ వైరలైంది. పట్టపగలే రాయదుర్గం ఆర్టీసీ బస్సుపై దాడికి తెగబడిన తీరు చూసి స్థానికులు భయంతో వణికిపోయారు. ఒంటిపై చొక్కా కూడా లేకుండా చేతిలో చెప్పులు పట్టుకుని మరీ గట్టిగా కేకలు వేస్తూ అరాచకం చేశారు. కాగా ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మద్యం సేవించి హల్‌చల్..

మంగళవారం రాత్రి స్థానిక బళ్లారి బైపాస్ రోడ్డులోని దివాకర పాన్ సెంటర్ వద్ద పూటుగా మద్యం తాగిన కొంతమంది యువకులు అటుగా కాలినడకన వెళుతున్న పెద్దవారిపై చెయ్యి చేసుకున్నారు. వారిని అంతగా కొడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వాహనదారులు అక్కడ జరుగుతున్న గొడవను చూసి మరింత దూరం వెళ్లి వేరు మార్గం గుండా వెళ్లారు. అల్లరి మూకల చేతిలో దెబ్బలు తిని బట్టలు చిరిగిపోయి నిస్సహాయంగా వెళుతున్న వారిని చూసి స్థానిక మహిళలు సైతం అయ్యో పాపమని జాలిపడ్డారు. ఇవి కేవలం కొన్ని వెలుగులోకి వచ్చిన సంఘటనలు మాత్రమే. వెలుగులోకి రానివి మరెన్నో ఉన్నాయి. పోలీసులు కేవలం స్టేషన్లకు పరిమితం కావడంతో ఈ పరిస్థితి దాపురించిందని నగర వాసులు అంటున్నారు. చీకటి పడితే మహిళలు, చిన్నారులను నగరంలోకి పంపాలంటే కుటుంబ సభ్యులు భయపడుతున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్ బాషా



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు, ఐసీడీఎస్ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయి. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. బుధవారం స్థానిక గ్లోబల్ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, చైల్డ్ మ్యారేజస్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. డ్రగ్స్ అలవాటు చేసుకుంటే జీవితం చిత్తవుతుందన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: బాల్య వివాహాలకు అడ్డుకట్ట లక్ష్యంగా పని చేయాలని ఆర్డీఓ కేశవనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మారుస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త భారత్ ముఖ్య ఉద్దేశ్యం బాల్యవివాహాల నిర్మూలన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీఓ లలిత, నోడల్ అధికారి వనజాక్షి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి వెంకటేశ్వరి, లీగల్ ఆఫీసర్ సంధ్యారాణి, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ బానూజా ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనంతపురం: బాల్య వివాహాలు అరికట్టి.. బాల్యాన్ని రక్షిద్దామనే నినాదంతో బుధవారం చిన్నారులతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నగరంలోని బాలసదనంలో ఐసీడీఎస్ పీడీ బీఎస్ శ్రీదేవి ఆదేశాల మేరకు పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. నోడల్ ఆఫీసర్ వనజాక్షి, చైల్డ్‌ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, సంధ్యా రాణి, సీడీపీఓ భారతి, శిశు గృహ మేనేజర్ దీప్తి, చిల్డ్రన్స్ హోం సూపరింటెండెంట్ నేతాజీ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరా ఆపరేటింగ్‌పై శిక్షణ



సూచనలిస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: రామగిరి సర్కిల్ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల పోలీసులకు బుధవారం డ్రోన్ కెమెరా ఆపరేటింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్ మాట్లాడారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా గుర్తించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మనిషి వెళ్లలేని ప్రాంతాల్లోకి డ్రోన్ కెమెరా వెళ్తుందన్నారు. కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి ఎస్‌ఐలు సత్యనారాయణ, సుధాకర్ యాదవ్, రిజ్వాన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న డ్రోన్ల నిఘా

అనంతపురం: అనంతపురం నగర శివారు కాలనీలు, పరిసర ప్రదేశాల్లో డ్రోన్ల నిఘా కొనసాగుతోంది. అనంతపురం వన్, ఫోర్త్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని శివారు కాలనీలు, పరిసర ప్రదేశాల్లో ఆయా పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టారు. నాగిరెడ్డిపల్లి, ఏ.నారాయణపురం, తపోవనం, ఆలుమూరు రోడ్డు, కక్కలపల్లి కాలనీ, తదితర శివారు కాలనీల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. ఫోర్త్ టౌన్ పరిధిలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వారిని గుర్తించి కేసు నమోదు చేశారు.

ఏమి హాయిలే ఇలా..



అల్లరికి కేరాఫ్ అడ్రస్‌గా కోతిని చెబుతాం. ఊరికే గొడవలకు దిగడం, ఏ కారణం లేకుండా రచ్చ చేయడం వానరాలకు అలవాటే. అలాంటి ఓ వానరం బుధవారం అనంతపురం చెరువు కట్టపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడిపై ఉన్న నెమలి బొమ్మల మధ్యలో కునుకుతీసింది. బాగా అలసిపోయినట్లు కనిపిస్తున్న ఈ కోతి.. తొలుత రెండు నెమలి బొమ్మల మధ్య కాసేపు అటూ ఇటూ తిరిగింది. అనంతరం మెల్లగా నిద్రలోకి జారుకున్న వానరం ఫొటోలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం: